సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం ı 14 ı ఫిబ్రవరి ı 2025



సోమశిలలో 63.71 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 63.714 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు నాలుగు వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.88,420
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,973
3 శాతం జీఎస్టీతో	రూ.8,212
నవర (8 గ్రా)	రూ.65,696

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0 /22.1

జిల్లాలో వాతావరణం శుక్రవారం సాధారణంగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 52 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలి



సీతారామపురం: ఎమ్మెస్సెమ్‌ఈ సర్వే, హౌస్ హోల్డ్ జియోట్యాగింగ్, వలసవాసుల గుర్తింపు, చిన్నారులకు ఆధార్ తదితర సర్వేలపై సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో పూర్తిచేయాలని డిప్యూటీ సీఈఓ మోహన్ రావు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో చేపడుతున్న ఆరు రకాల సర్వేల్లో వెనుకబడటానికి గల కారణాలను ఆరా తీశారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో సర్వేలను వేగవంతం చేయాలన్నారు. ఎంపీడీఓ భాస్కర్, ఈఓపీఆర్డీ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ పరీక్షలు రేపు

నెల్లూరు సిటీ: ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి 10, 12వ తరగతుల విద్యార్థులకు సీబీఎస్‌ఈ పరీక్షలను శనివారం నిర్వహించనున్నామని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ శంకరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను అమర్చామని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్షలు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరగనున్నాయని, ఆయా కేంద్రాలకు విద్యార్థులు పది గంటల్లోపు చేరుకోవాలని సూచించారు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో గల దామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్టులో మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు గురువారం తెలిపారు. 300.. 380.. 480 మెగావాట్ల మేర విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు.

మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

నెల్లూరు సిటీ: ధనలక్ష్మీపురంలోని ఓ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. ధనలక్ష్మీపురంలోని ఓ పాఠశాలలో విద్యార్థిని పదో తరగతి చదువుతోంది. ఈ క్రమంలో మొదటి బెంచ్ నుంచి రెండో బెంచ్‌లో కూర్చోవాలని టీచర్ సూచించారు. మరోవైపు సహచరుల ముందు తనను తక్కువ చేసి మాట్లాడటంతో మనస్తాపానికి గురైంది. అనంతరం హాస్టల్‌కు వచ్చి భవనం పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చేతికి గాయమవడంతో ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. ఘటనపై రూరల్ పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఏడు వేల ఇంకుడుగుంతల నిర్మాణమే లక్ష్యం

- డ్వామా పీడీ గంగాభవాని



ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న పీడీ

మనుబోలు: జిల్లాలో మొదటి విడతలో ఏడు వేల ఇంకుడుగుంతలను తవ్వించడమే లక్ష్యమని డ్వామా పీడీ గంగాభవాని తెలిపారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఇంకుడుగుంతను గురువారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఇంకుడు గుంతలను నిర్మిస్తున్నామన్నారు. మండలంలో 69 నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. గుంత తవ్విన వెంటనే సంబంధిత లబ్ధిదారు బ్యాంక్ ఖాతాలో రూ.ఆరు వేలు జమవుతుందన్నారు. జిల్లాలో సరాసరిన రోజుకు 41 వేల మంది, మండలంలో 700 మంది ఉపాధి పనులు చేస్తున్నారని తెలిపారు. మండలంలో కూలీల సంఖ్యను 2500కు పెంచాలన్నారు. సరాసరి వేతనంగా రూ.252 అందుతుందన్నారు. ఏపీఓ రాజమ్మ, టీఏ సుప్రజ, ఎఫ్ఏ సునీల్ పాల్గొన్నారు.

కండలేరులో 53.478 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 53.478 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 720, లోలెవల్ కాలువకు 150, హైలెవల్ కాలువకు 190, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

సింహపురి ఆభరణాలు భళా..



స్వర్ణాభరణాల తయారీలో దక్షిణాది రాష్ట్రాల్లో సింహపురి రెండో స్థానాన్ని ఆక్రమించింది. ఇక్కడ లభించే వినూత్న డిజైన్లకు దేశవ్యాప్తంగా మంచి క్రేజ్ ఉంది. స్థానికంగా స్థిరపడిన మార్వాడీలు, జైన్లు.. ఇక్కడి వారు అందించే ముడి సరుకుతో ఆభరణాలను తయారు చేస్తూ స్వర్ణకారులు, ముస్లింలు ఉపాధి పొందేవారు. అయితే కాలక్రమేణా వీరి స్థానాన్ని బెంగాలీలు ఆక్రమిస్తున్నారు. ఫలితంగా ఎన్నో ఏళ్లుగా ఇదే వృత్తిని నమ్ముకున్న తయారీదారులు ప్రస్తుతం జీవనోపాధి కోల్పోయి నానా అగచాట్లు పడుతున్నారు.

- ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి
- 50 ఏళ్లకుపైగా చరిత్ర
- దక్షిణాదిలో రెండో స్థానంలో నెల్లూరు
- తయారీలో బెంగాలీలవైపే ప్రస్తుతం మొగ్గు
- జీవనోపాధి కోల్పోతున్న స్థానిక స్వర్ణకారులు

▸▸ జిల్లాలో రూపొందినవి ప్రత్యేకం





నెల్లూరు (పొగతోట): స్వర్ణాభరణాల తయారీకి కేరాఫ్‌గా నెల్లూరు నిలుస్తోంది. దక్షిణాదిలో కోయంబత్తూరు తర్వాతి స్థానం నెల్లూరుదే కావడం విశేషం. చెన్నై సైతం మూడో స్థానంలో ఉందంటే ఇక్కడ రూపొందించే ఆభరణాలకు ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి 50 ఏళ్ల నుంచే జిల్లాలో నిష్ణాతులు పాతుకుపోయారు. పెద్ద, చిన్న, అతి సూక్ష్మ ఆభరణాల తయారీలో ఇక్కడి స్వర్ణకారులు ప్రావీణ్యం సాధించారు. అరగ్రాము, గ్రాముతో చిన్న కమ్మలు, నెక్లెస్‌లు, స్టోన్ ఐటమ్స్‌ను రూపొందించడంలో చేయి తిరగడంతో వీటిని సింగపూర్, మధ్య ప్రాచ్య దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. జిల్లాలో నెలకు రూ.500 కోట్లకుపైగా వ్యాపారం జరుగుతోందని అంచనా.

జిల్లాలో ఇలా..

ఆభరణాలను తయారు చేసే స్వర్ణకారులు జిల్లాలో సుమారు 15 వేల మందికిపైగా ఉన్నారు. చిన్న, పెద్ద బంగారు షాపులు నగరంలో వెయ్యికిపైగా ఉన్నాయి. స్వర్ణాభరణాలను తయారు చేయడంలో ప్రారంభంలో స్థానిక స్వర్ణకారులు, అనంతరం ముస్లింలు, ప్రస్తుతం బెంగాలీలు ముందంజలో ఉన్నారు. చేతితో తయారుచేసే బంగారు ఆభరణాలను ప్రజలు అమితంగా ఇష్టపడుతున్నారు. అదే ముంబై, కోయంబత్తూర్ తదితర ప్రాంతాల్లో మెషీన్ కటింగ్‌తో తయారు చేస్తున్నారు. నగరంలోని ఆచారి వీధి, చిన్నబజార్, కొరటాల వీధి, గిడ్డంగివీధి, కాకర్ల వీధి, కుక్కల గుంట, మండపాల వీధిలో వేలాది మంది స్వర్ణకారులు జీవనోపాధి పొందుతున్నారు. అధిక శాతం షాపులనూ ఆయా ప్రాంతాల్లోనే ఏర్పాటు చేశారు.

కాలానుగుణంగా మార్పులు

స్వర్ణకారులకు ముడి సరుకును మార్వాడీలు, జైన్లు, స్థానికులు అందజేస్తారు. స్వర్ణకారులుండే రోజుల్లో వంద గ్రాముల బంగారానికి 8 గ్రాముల తరుగు, కూలిని అందించేవారు. ఇలా వంద గ్రాముల బంగారాన్ని ఇస్తే 92 గ్రాములతో ఆభరణాలను తయారుచేసేవారు. ఫలితంగా స్వర్ణకారులకు 8 గ్రాముల బంగారం, కూలి లభించేది. అనంతరం తయారీలో ముస్లింలు ప్రవేశించారు. ఆ సమయంలో కూలిని ఎత్తేసి తరుగును మాత్రమే ఇచ్చేవారు.

గోల్డ్ మాఫియా ఆగడాలు

జిల్లాలో గోల్డ్ మాఫియా ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. బడా నేతల సహకారంతో ప్రభుత్వానికి ఎలాంటి పన్నులు చెల్లించకుండానే రూ.కోట్ల విలువైన బంగారు ఆభరణాలను ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. జిల్లాలో తయారు చేస్తున్న రాళ్ల, ఫ్యాన్సీ ఐటమ్స్ నగలకు దేశ వ్యాప్తంగా ప్రత్యేక డిమాండ్ ఉండటంతో ఇతర రాష్ట్రాలకు చెందిన బడా వ్యాపారులు దొడ్డిదారిన తీసుకొచ్చి



తయారీ అనంతరం అదే మార్గంలో అక్రమంగా తరలిస్తున్నారు. అధికారులు, పోలీసులకు ప్రతి నెలా ముడుపులు అందుతుండటంతో నామమాత్రపు తనిఖీలు చేసి చేతులు దులుపుకొంటున్నారు.

పెండింగ్‌లో ఎఫ్ఐఆర్‌లు

బంగారు ఆభరణాలను తయారు చేసేందుకు వచ్చిన బెంగాలీల్లో అధిక శాతం మంది పూర్తి వివరాల్లేకుండానే ఉంటున్నారు. బంగారు ఆభరణాల చోరీలకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లు సంతపేట పోలీస్‌స్టేషన్లో అధిక శాతం పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు వీటిని తయారు చేసే దుకాణంలో సీసీ ఫుటేజీలు అందుబాటులో ఉన్నా, అపహరించిన వారిని పట్టుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారు.

కార్మికులుగా స్వర్ణకారులు



ఆభరణాల తయారీలో నిమగ్నమైన బెంగాలీలు

జిల్లాలో నైపుణ్యమున్న స్వర్ణకారులు కార్మికులుగానే మిగిలిపోతున్నారు. వీరి జీవితాల్లో వెలుగులు రావడంలేదు. బెంగాల్ నుంచి తయారీదారులను ఆహ్వానించి సూక్ష్మ బంగారు ఆభరణాలను రూపొందించడాన్ని ప్రారంభించారు. సూక్ష్మ, పలచటి ఆభరణాలపై ఎక్కువ మంది ఆసక్తి చూపడంతో అధిక శాతం మంది రావడం ప్రారంభించారు. తయారీలో ప్రస్తుతం వీరే కీలకంగా వ్యవహరిస్తున్నారు. వీరికి ప్రస్తుతం తరుగుగా ఐదు గ్రాములను ఇస్తున్నారు. వీరి రంగప్రవేశంతో స్వర్ణకారులు, ముస్లింలు ఉపాధి కోల్పోయారు. ఫలితంగా ఆటోలు తోలుకుంటూ, కూరగాయలు, పండ్ల వ్యాపారాలు, బడ్డీ కొట్లు నడుపుకొని జీవనం సాగిస్తున్నారు.

సందట్లో సడేమియాగా మధ్యవర్తులు

బంగారు ఆభరణాల తయారీలో మధ్యవర్తులుగా చిన్నబజార్, పెద్దబజార్ తదితర ప్రాంతాలకు చెందిన కీలక వ్యక్తులను ఏర్పాటు చేసుకున్నారు. మధ్యవర్తులు సూచించిన వ్యక్తులకే బంగారాన్ని ఆభరణాల తయారీ నిమిత్తం ఇస్తారు. తయారీదారులకొచ్చే తరుగులో కొంత భాగాన్ని వీరు తీసుకుంటున్నారు. మరోవైపు కొన్ని చోట్ల కీలకంగా ఉండే వ్యక్తులకు బంగారు ముడి సరుకును ఇస్తున్నారు. వీరు బెంగాలీలతో బంగారు ఆభరణాలను తయారు చేయించి తిరిగి అందజేస్తున్నారు.

అల్లా..మెుదలైంది



శివకుమార్, జయశ్రీ

▸ లవ్ ఫర్ ఎవర్
▸ ఆలోచనలు ఒక్కటైతే.. లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కలిపింది

వెంకటగిరికి చెందిన సూరా శివకుమార్, నెల్లూరు నివాసి రామిశెట్టి జయశ్రీ చెన్నైలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో 2017లో ఉద్యోగంలో చేరారు. అప్పట్లో వీరి వయస్సు 24, 22 ఏళ్లు. ఆ సమయంలో వీరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వీరివి వేర్వేరు సామాజికవర్గాలైనా పెద్దలను ఒప్పించి అందరి సమక్షంలో 2020లో వివాహం చేసుకున్నారు. మైపాడు గేట్ సమీపంలోని రామ్‌నగర్‌లో వీరు నివాసం ఉంటున్నారు. ఎలాంటి పొరపచ్చాల్లేకుండా ఇద్దరూ తమ మూడేళ్ల కుమారుడితో ఆనందంగా జీవిస్తున్నారు. చెన్నైలో తన ఉద్యోగాన్ని శివకుమార్ కొనసాగిస్తుండగా, ఆమె సెలవుపై ఉన్నారు.

ప్రేమ.. ఈ పదం వింటే కలిగే అనుభూతే వేరు. ప్రేమించడం.. తిరిగి దాన్ని పొందాలని ఎంతో మంది కలలుగంటారు. అయితే ఈ అవకాశం కొందరికే లభిస్తుంది. చదువుకునే రోజులు.. ఉద్యోగం.. సందర్భమేదైనా యువతీ, యువకుల మధ్య చిగురించే ఈ బంధం తీయని జ్ఞాపకాలను మిగిలిస్తుంది. పెద్దల్ని ఒప్పించి కొందరు వివాహం చేసుకుంటే.. మరికొందరు వారిని ఎదిరించి మరీ పెళ్లికి సిద్ధమవుతారు. అనంతరం ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నా, తమ ప్రేమ బంధాన్ని నిండునూరేళ్లు సాగిస్తూ ఆనందకర జీవనంతో గడుపుతున్నారు. ప్రేమికుల దినోత్సవాన్ని శుక్రవారం పురస్కరించుకొని ప్రత్యేక కథనం.

– నెల్లూరు (బారకాసు) / ఆత్మకూరు

వాలెంటైన్స్ డే నేడు



సందానీ, ముజీబున్నీసా

అన్యోన్య బంధం

ఆత్మకూరుకు చెందిన మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సందానీ, ముజీబున్నీసా దంపతులు అన్యోన్యంగా తమ వివాహ బంధాన్ని సాగిస్తున్నారు. చదువు నిమిత్తం మూడు దశాబ్దాల క్రితం సందానీ తన స్వగ్రామమైన అనంతసాగరం మండలం నుంచి ఆత్మకూరు వచ్చారు. మెడికల్ ల్యాబ్ కోర్సులో శిక్షణ పొంది ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఉద్యోగం చేయసాగారు. అప్పట్లో పట్టణంలోని ఎల్ఆర్‌పల్లిలో నివసించే సందానీకి సమీపంలోని ఓ ఇంట్లో ఉంటున్న ముజీబున్నీసాతో పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారింది. ఇరు కుటుంబాలు తొలుత అంగీకరించలేదు. పలువురితో రాయబారాలు పంపినా వివాహం వాయిదా పడేది. ఎట్టకేలకు 1998లో పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నారు. వీరి ఇద్దరు కుమారులను చక్కగా చదివించారు. తమ 27 ఏళ్ల వైవాహిక బంధాన్ని అన్యోన్యంగా సాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

దారి తప్పుతున్న దర్యాప్తు..?

- భారీ ఆర్థిక కుంభకోణంపై నోరు మెదపని పోలీసులు
- బాధితుల్లో తీవ్రమవుతున్న ఆందోళన



కావలి: పట్టణాన్ని కుదిపేసిన 'సుభానీ స్కామ్' వ్యవహారంలో దర్యాప్తు దారి తప్పుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రూ.200 కోట్ల కుంభకోణంలో పోలీసులు గోప్యంగా దర్యాప్తు సాగిస్తుండటం, వాస్తవాలను వెల్లడించకపోవడంపై బాధితుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పట్టణ పరిధిలోని ముసునూరు కేంద్రంగా స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో రూ.వందల కోట్ల కుంభకోణం జరుగుతోందంటూ ఆర్నెల్ల క్రితమే ప్రజలను 'సాక్షి' అప్రమత్తం చేసిన విషయం తెలిసిందే. గుంటూరుకు చెందిన నిర్వాహకుడు సుభానీ నుంచి అప్పటికే భారీగా లబ్ధి పొందిన కావలి పోలీసులు విచారణ పేరుతో తాత్సారం చేశారనే ఆరోపణలున్నాయి. కేసు నమోదవుతున్న విషయాన్ని ముందుగానే తెలుసుకున్న ఆయన.. ఆధారాలను మాయం చేసి, డబ్బులను జాగ్రత్త చేశాకే పోలీసులు రంగ ప్రవేశం చేశారు. పది రోజుల క్రితం అదుపులోకి తీసుకొని విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారు.

భారీ స్థాయిలో ముడుపులు

సొమ్ము భారీగా పక్కదారి పట్టి కొంత మంది పోలీసుల జేబుల్లోకి వెళ్లిందని బాధితులు ఆరోపిస్తున్నారు. సుభానీకి అనుచరుడిగా మారిన ఓ కానిస్టేబుల్ ద్వారా అందరికీ పెద్ద స్థాయిలో ముడుపులు అందాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. సదరు కానిస్టేబుల్ రూ.రెండు కోట్లతో పెద్ద భవంతిని నిర్మించుకోవడంతో పాటు రూ.లక్షల విలువైన లగ్జరీ బైక్‌లు, సెల్‌ఫోన్లు తదితర విలాస వస్తువులను కొనుగోలు చేశారని చెప్తున్నారు. ఈయన ద్వారా ఓ సీఐ, ఎస్సై, మరికొందరికి పెద్ద మొత్తంలో ముడుపులు చేరాయని బాధితులు ధ్వజమెత్తుతున్నారు. మరోవైపు ఈయన ద్వారానే కావలిలోని చాలా మంది పోలీస్ సిబ్బంది ట్రేడింగ్ స్కామ్ నిర్వాహకుడు సుభానీ వద్ద పెట్టుబడులు పెట్టారని తెలుస్తోంది. పోలీసులే పాత్రధారులుగా ఉన్న ఈ భారీ కుంభకోణంలో తిరిగి వారితోనే విచారణ చేయిస్తుండటం, వివరాలను గోప్యంగా ఉంచడంపై బాధితుల్లో ఆందోళన తీవ్రమవుతోంది.

నోరు మెదపరేం..?

గుంటూరుకు చెందిన సుభానీ అనంతార్థ అసోసియేట్స్ పేరుతో ముసునూరులో కార్యాలయాన్ని ఏర్పాటు చేసి వేలాది మంది నుంచి రూ.200 కోట్లకుపైగా వసూలు చేశారు. అంతకు ముందు తెలంగాణలోని మక్తల్‌లోనూ పెట్టుబడుల పేరుతో మోసం చేసి బోర్డు తిప్పేసిన చరిత్రా ఉంది. అక్కడి బాధితులు సైతం వచ్చి ఇక్కడి పోలీసులకు మొరపెట్టుకుంటున్నారు. కావలి, పరిసర ప్రాంతాల నుంచి ఇప్పటికే 300 మందికిపైగా పోలీసులను ఆశ్రయించారు. కీలక నిందితుడు పది రోజుల నుంచి వారి అదుపులోనే ఉన్నారు. అయినా దర్యాప్తుపై ఇప్పటి వరకూ నోరు మెదపకపోవడం గమనార్హం. బాధితుల ఫిర్యాదులపై కేసులు నమోదు చేయడంలేదనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి.

హోమ్ మంత్రి, సీఎంకు ఫిర్యాదులు

ఈ అంశంపై హోమ్ మంత్రి, సీఎం, ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగాలకు పలువురు బాధితులు ఆన్‌లైన్లో ఫిర్యాదు చేశారని తెలిసింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన సిబ్బందిపై ఏసీబీ విభాగానికి ఫిర్యాదు చేశారని సమాచారం. ఉన్నత స్థాయిలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించి, స్కామ్ మూలాలను వెలికితీయడంతో పాటు ఆదాయ పన్ను, ఏసీబీ అధికారులు పూర్తిస్థాయిలో ఆడిటింగ్ చేయిస్తే తప్ప బాధితులకు న్యాయం జరిగే పరిస్థితి కనిపించడం లేదు.

అంతా గుట్టుచప్పుడు..

ఇప్పటి వరకు ఎన్ని ఫిర్యాదులొచ్చాయి.. ఎంత మేర మోసం జరిగింది.. ఎన్ని బ్యాంక్ ఖాతాలను సీజ్ చేశారు.. ఇందులో ఎంత మొత్తంలో నగదు ఉంది.. స్థిర, చరాస్తులను ఎంత వరకు గుర్తించారు.. బాధితులకు ఎప్పటిలోపు న్యాయం చేస్తారనే అంశాలపై పోలీసులు నోరు మెదపడంలేదు. పది శాతం మాత్రమే బ్యాంక్ లావాదేవీలు జరగ్గా, మిగిలిన సొమ్మంతా నగదు రూపంలోనే చేతులు మారాయని బాధితులు చెప్తున్నారు. ఇన్‌కంట్యాక్స్, బ్యాంకులతో సమస్య వస్తుందంటూ నగదు రూపంలోనే 90 శాతం పెట్టుబడులను స్వీకరించారని బాధితులు ఆరోపిస్తున్నారు.

క్లుప్తంగా

ఫోర్జరీ సంతకాలతో మోసం

• క్లర్క్‌పై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఫోర్జరీ సంతకాలు, నకిలీ సర్టిఫికెట్లతో మోసాలకు పాల్పడిన ఓ క్లర్క్‌పై నెల్లూరు చిన్నబజారు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన కె.స్రవంతి శ్రీసాయి ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్. నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్, అనంతపురం జిల్లాల్లో జూనియర్, ఒకేషనల్, డిగ్రీ, పీజీ, బీఈడీ కళాశాలలను నిర్వహిస్తున్నారు. నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో సొసైటీ ప్రధాన కార్యాలయం ఉంది. అందులో పొదలకూరురోడ్డుకు చెందిన షేక్ ఆయిషా క్లర్క్‌గా పనిచేస్తున్నారు. విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లు ఆమె ఆధీనంలో ఉన్నాయి. కోర్సు పూర్తి చేసుకుని కళాశాల ఫీజులు పూర్తిగా చెల్లించిన వారికి ఒరిజినల్ సర్టిఫికెట్లను కరస్పాండెంట్ సంతకం, స్టాంప్ వేసిన అనంతరం ఇచ్చేవారు. మూడునెలలుగా విద్యార్థుల సెమిస్టర్ పరీక్షలు, ప్రాక్టికల్స్‌లో కరస్పాండెంట్ బిజీగా ఉన్నారు. ఇదే అదనుగా భావించిన ఆయిషా మోసాలకు తెరలేపారు. విద్యార్థుల వద్ద నుంచి నగదు తీసుకుని ప్రొవిజినల్ కమ్ కన్సాలిడేటెడ్ మార్క్స్ మెమో, టీసీ, స్టడీ కమ్ కాండక్ట్ సర్టిఫికెట్లు ఇచ్చారు. ఇటీవల ఈ విషయం తెలుసుకున్న కరస్పాండెంట్ విద్యార్థులకు మంజూరు చేసిన సర్టిఫికెట్లను పరిశీలించారు. వాటిపై ఉన్న సంతకం తనది కాదని, టీసీ, స్టడీ కమ్ కాండక్ట్ సర్టిఫికెట్లు నకిలీవని గుర్తించారు. దీంతో సదరు క్లర్క్‌ను నిలదీయగా తప్పైందని హడావుడిగా వెళ్లిపోయారు. ఆయిషా కోసం ఆమె ఇంటికెళ్లగా తాళం వేసి ఉంది. ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంది. ఫోర్జరీ సంతకాలు, నకిలీ సర్టిఫికెట్లతో మోసగించిన క్లర్క్‌పై చర్యలు తీసుకోవాలని కరస్పాండెంట్ చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

కందుకూరు: ఈనెల 15వ తేదీన కందుకూరులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, నెల్లూరు మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ, కందుకూరు సబ్ కలెక్టర్ టి.శ్రీపూజ, ఇతర శాఖాధికారులు విచ్చేశారు. పట్టణంలోని సీఎం పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. పర్యటన వివరాలను వారు వెల్లడించారు. సీఎం ఆరోజు ఉదయం 11 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి 11.45 గంటలకు కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చేరుకుంటారు. అక్కడ ప్రజా ప్రతినిధులు, నాయకులు సీఎంను కలుసుకుంటారు. 11.50 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 12.05 గంటలకు దూబగుంట శివారులో ఏర్పాటు చేసిన మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్‌కు ప్రారంభిస్తారు. 12.20 గంటలకు దూబగుంట గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో కలిసి పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాల్గొంటారు. దూబగుంట కుంట దగ్గర మొక్కలు నాటుతారు. 1.30 నుంచి 2.30 గంటల వరకు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణంలో ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తారు. 2.45 గంటలకు కందుకూరు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు.

18న శ్రీలక్ష్మీనరసింహునికి చందనాలంకారం

రాపూరు: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి మూలమూర్తి ఈ నెల18వ తేదీన చందనాలంకరణలో దర్శనమిస్తారని దేవస్థానం అధికారులు గురువారం తెలిపారు. ఉదయం 4 గంటలకు తిరుప్పావై, 9 గంటలకు శాంతి హోమం, 10 గంటలకు కల్యాణం, రాత్రి 7 గంటలకు బంగారు గరుడసేవ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఇళ్ల నిర్మాణ పనుల అడ్డగింత



వీఆర్వోతో మాట్లాడుతున్న లబ్ధిదారులు

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లిలో పక్కాగృహాల నిర్మాణ పనులను రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది గురువారం అడ్డుకున్నారు. ఇక్కడ గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీ పేరుతో లేఅవుట్ వేసి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. లబ్ధిదారులు గృహాల నిర్మాణాలు చేయిస్తుండగా పోలీస్ సిబ్బంది అడ్డుకున్నారు. జేసీబీ, ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పనులను అడ్డుకోవడంపై వీఆర్వో సూర్యను లబ్ధిదారులు ప్రశ్నించారు. ఇళ్ల స్థలాల పంపిణీకి సంబంధించి సర్వే చేస్తున్నామని, అందువల్ల పనులు ఆపించామని వీఆర్వో చెప్పారు. అర్హత కలిగిన వారి ఇళ్ల నిర్మాణ పనులను ఎలా ఆపుతారని, అసలు పోలీసులకు ఏం సంబంధం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

గంజాయి గుప్పు

▪ గత నెల 23వ తేదీన వెంకటాచలం టోల్‌ప్లాజా సమీపంలో ఆర్టీసీ బస్సులో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. ఈ సమయంలో నలుగురు వ్యక్తుల నుంచి 54.470 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

▪ ఇటీవల ఆత్మకూరు పంటబీధి శివారు పొలాల్లో పాడుబడిన ఇంటి వద్ద కొందరు గంజాయి సేవించి మత్తులో ఉండగా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 5 గ్రాముల బరువైన 13 ప్యాకెట్ల గంజాయి, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఏఎస్ పేటకు చెందిన మీరామొహిద్దీన్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. దీంతో అతడిని కూడా అరెస్ట్ చేసి 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

▪ నెల్లూరు ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉండగా బుధవారం బాలాజీ నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.



గత నెలలో వెంకటాచలం టోల్‌ప్లాజా సమీపంలో పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎక్సైజ్ అధికారులు



• జిల్లా వ్యాప్తంగా యువతే లక్ష్యంగా విక్రయాలు
• ఆ మత్తులో నేరాలు
• మొక్కుబడి చర్యలకే అధికారుల పరిమితం
• కూటమి ప్రభుత్వంలో ఇదీ పరిస్థితి

నెల్లూరు(క్రైమ్): కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో గంజాయి గుప్పుమంటోంది. యువతే లక్ష్యంగా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మత్తులో జోగుతూ నేరాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న సందర్భాలున్నాయి. గంజాయి, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ఈగల్ (ఎలైట్ యాంటీ నార్కొటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) ఇంకా తన కార్యకలాపాలను ప్రారంభించలేదు. ఎక్సైజ్, పోలీసు అధికారులు మొక్కుబడి చర్యలకే పరిమితమవడంతో అక్రమార్కులు బరితెగిస్తున్నారు.

గతంలో ఇలా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పోలీస్, సెబ్ అధికారులు గంజాయిపై ఉక్కుపాదం మోపారు. జాతీయ రహదారి వెంబడి నిరంతరం తనిఖీలు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పెద్దఎత్తున స్వాధీనం చేసుకున్నారు. విక్రయాలపై విస్తృత దాడులు చేసి పెద్దఎత్తున సరఫరదారులు, వ్యాపారులను కటకటాల వెనక్కి పంపారు. రైలు మార్గాల్లో తరలిపోతుందన్న సమాచారం అందుకుని అక్కడి పోలీసుల సహకారంతోనూ దాడులు కొనసాగించారు. గంజాయి సేవించేవారిని సైతం వదిలిపెట్టలేదు. తీరుమారని విక్రయదారులపై పీడీ యాక్టులు నమోదు చేయడంతో జిల్లాలో గంజాయి విక్రయాలు గణనీయంగా తగ్గాయి. అమ్మకాలు సాగించాలంటేనే భయపడే పరిస్థితి నాడు తెచ్చారు. అక్రమార్కులను అరెస్ట్ చేయడంతోనే సరిపెట్టుకోకుండా మూలాలను సైతం కనుక్కొని చర్యలు తీసుకున్నారు. దీంతో 2020 నుంచి 2023 వరకు జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై 172 కేసులు నమోదు చేసి 349మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 2,190 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

నేడు నిఘా కొరవడి..

కూటమి ప్రభుత్వం సెబ్‌ను రద్దు చేసి ఎక్సైజ్ శాఖను పునర్ వ్యవస్థీకరించింది. ఎక్సైజ్, పోలీసు శాఖల నిఘా కొరవడడంతో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు తిరిగి మొదలయ్యాయి. ఏవోబీ, విశాఖ, నర్సీపట్నం తదితర ప్రాంతాల నుంచి రోడ్డు, రైలు మార్గాల ద్వారా గంజాయి రవాణా జోరుగా సాగుతోంది. జిల్లాకు చెందిన కొందరు వ్యాపారులు గంజాయి పెంపకదారులు, సరఫరాదారులతో పరిచయాలు పెంచుకుని కేజీ రూ.2,000 నుంచి రూ.3,500 వంతున కొనుగోలు చేసి జిల్లాలో రూ.20 వేలకు అమ్ముతున్నారు. వీటిని చిన్నచిన్న పొట్లాలుగా చేసి ఒక్కొక్కటి రూ.400, రూ.300, రూ.200, రూ.100 వంతున విక్రయిస్తున్నారు. అధికారులు మొక్కుబడి దాడులకే పరిమితమైనట్లు విమర్శలున్నాయి. దీంతో పట్టణం నుంచి పల్లెవరకు గంజాయి విక్రయాలు జోరుగా సాగుతోన్నాయి. గతేడాది అధికారులు కేవలం 25 కేసులకే పరిమితమయ్యారు. ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం రెండు, మూడు కేసులు మాత్రమే నమోదయ్యాయి.

మూలాల్లోకి వెళ్లేనే..

అక్రమార్కులు నిరుద్యోగులు, నిరుపేదలను అక్రమ రవాణాకు వాడుకుంటూ వారికి ట్రిప్‌కు రూ.10 వేల వంతున ముట్టజెబుతున్నారు. మహిళలను సైతం ఇందుకు ఉపయోగించుకుంటున్నారు. ఈ క్రమంలో కొందరు ఎక్సైజ్, పోలీస్ అధికారులకు చిక్కి జైలుపాలవుతున్నారు. అధికారులు అరెస్ట్‌లతో సరిపెట్టుకుంటూ మూలాల్లోకి వెళ్లడం లేదు. దీంతో అమ్మేవాడు, కొనేవాడు సురక్షితంగా ఉంటుండగా రవాణా చేసే వారే కటకటాలపాలవుతున్నారు. దీంతో అక్రమ రవాణాకు అడ్డుకట్టపడటం లేదు. ఇప్పటికైనా అధికారులు దాడులు విస్తృతం చేయడంతోపాటు సూత్రధారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాల్సిన ఉంది.

వారే లక్ష్యంగా..

ప్రధానంగా యువత, విద్యార్థులే లక్ష్యంగా విక్రయాలు సాగుతున్నాయి. తొలుత సరదాగా అలవాటు చేసుకున్న వారు మత్తుకు బానిసలవుతున్నారు. తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్‌మనీ, పార్ట్‌టైం ఉద్యోగాల ద్వారా సంపాదించుకున్న నగదును గంజాయికే ఖర్చుపెడుతున్నారు. మత్తుకు సరిపడా నగదు లేని వారు స్మగ్లర్లుగా అవతారమెత్తుతున్నారు. ఇంకొందరు కమీషన్ పద్ధతిపై గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. పలువురు మత్తుకు బానిసలై పైశాచికంగా ప్రవర్తిస్తున్నారు. మత్తులో నేరాలకూ పాల్పడుతున్నారు. ఇటీవల నిందితులు గంజాయి మత్తులోనే నేరాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

టీడీపీకి మద్దతు ఇవ్వలేదని..

• భూవివాదాన్ని సాకుగా చూసి వైఎస్సార్‌సీపీ నేతలపై దాడి
• టీడీపీ నాయకుల దాష్టీకం



తీవ్రంగా గాయపడిన నారాయణ



చికిత్స పొందుతున్న కృష్ణయ్య



చికిత్స పొందుతున్న సుధాకర్‌రెడ్డి

ఆత్మకూరు: నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకుల అరాచకాలు ఎక్కువయ్యాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడుతున్నారు. తాజాగా టీడీపీకి మద్దతు ఇవ్వడం లేదని ఆత్మకూరు మండలం బండారుపల్లి గ్రామానికి వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పగుంట కృష్ణయ్య, సుధాకర్‌రెడ్డిపై టీడీపీకి చెందిన బద్దెపూడి తిరుపాలు, కిశోర్, రమణమ్మలు బుధవారం రాత్రి దాడికి పాల్పడి గాయపరిచారు. భూ వివాదాన్ని సాకుగా చూసి వైఎస్సార్‌సీపీ నేతల్ని టార్గెట్ చేశారు. కాగా కృష్ణయ్య కుమారుడు నారాయణ నెల్లూరులో వ్యాపారం నిర్వహిస్తుంటాడు. తన తండ్రిపై దాడి జరిగిన విషయం తెలుసుకున్న అతను బుధవారం అర్ధరాత్రి గ్రామానికి చేరుకున్నాడు. దాడికి పాల్పడిన వారి సమీప బంధువైన బాసం హేమంత్, అతని తల్లి రమణమ్మలు గురువారం తెల్లవారుజామున నారాయణ ఇంటి వద్దకు వచ్చి అతడిపై ఇనుప రాడ్‌తో దాడికి పాల్పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే సమీపంలోని వారు నారాయణను ఆత్మకూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. దాడులకు పాల్పడుతున్న టీడీపీ వారిపై స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా వారు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దారుణం

అధికారాన్ని అడ్డం పెట్టుకుని కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేయడం దారుణమని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, రూరల్ నాయకుడు బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి అన్నారు. టీడీపీ వారు దాడులు చేయడంతో ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇప్పగుంట కృష్ణయ్య, సుధాకర్ రెడ్డి, నారాయణను గురువారం నేతలు పరామర్శించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ జి.గంగాధర్‌ను కలిసి దాడి జరిగిన విషయం, కేసుల నమోదుపై మాట్లాడారు. తాము అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఇలాంటి భౌతికదాడులకు పాల్పడిన ఘటనలు చోటు చేసుకున్నాయా? అని పోలీసులను ప్రశ్నించారు. అప్పట్లో ఎలాంటి వివాదాలు లేకుండా పార్టీలకతీతంగా పాలన సాగిన విషయాన్ని గుర్తు చేశారు. కేసులు నమోదు చేసి దోషులను అరెస్ట్ చేయాలని కోరారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఇరువర్గాలను కలిపి కమిటీ వేస్తామని, భవిష్యత్‌లో గొడవలు పడకుండా చూస్తామని రూ.2 లక్షలతో పూచీకత్తు రాయిస్తామని సీఐ వైఎస్సార్‌సీపీ నాయకులకు తెలిపారు. వారి వెంట నాగేంద్రపురం వెంగళరెడ్డి తదితరులున్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 122 మంది గైర్హాజరు

నెల్లూరు(టౌన్): ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు గురువారం 122 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షలకు 2,865 మందికి గానూ 2,831 మంది హాజరయ్యారు. 34 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన వాటికి 2,936 మందికి గానూ 2,848 మంది హాజరయ్యారు. 88 మంది గైర్హాజరయ్యారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	114
లేయర్ (లైవ్) :	80
బ్రాయిలర్ చికెన్ :	210
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	234
లేయర్ చికెన్ :	136

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.40 సన్నవి : రూ.25
పండ్లు : రూ.18

300 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

• సివిల్ సప్లయ్స్ అధికారులు



మాట్లాడుతున్న డీఎం అర్జున్‌రావు

నెల్లూరు(పొగతోట): జిల్లా వ్యాప్తంగా 300 ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని డీఎస్‌ఓ అంకయ్య, డీఎం అర్జున్‌రావు తెలిపారు. నెల్లూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై గురువారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈనెలాఖరు నుంచి వరికోతలు ముమ్మరంగా జరిగే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం కొలిచే యంత్రాలను అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యం పుట్టి (850 కేజీలు)కి రూ.19,720లు, సాధారణ రకం పుట్టికి రూ.19,550లు మద్దతు ధర ప్రకటించిందన్నారు. అంత కంటే తక్కువ ధరకు కొనుగోలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్ణయించిన తేమ శాతాన్నే రైస్‌మిల్లుల్లో ఆమోదించడం జరుగుతుందన్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసేందుకు 103 రైస్ మిల్లులను ఎంపిక చేశామన్నారు. అక్కడ లారీలు అధిక సమయం ఉండకుండా ధాన్యాన్ని ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేసేలా చర్యలు చేపడతున్నామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ సత్యవాణి, వ్యవసాయ శాఖ అధికారులు, సీఎస్ డీటీలు, సచివాలయ, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలకు అవార్డుల అందజేత



అవార్డులు పొందిన డాక్టర్లతో డీఎంహెచ్‌ఓ సుజాత

• డీఎంహెచ్‌ఓ చేతుల మీదుగా అందుకున్న డాక్టర్లు

నెల్లూరు(అర్బన్): రెండు పీహెచ్‌సీలు, ఐదు ఆయుష్మాన్‌భవ మందిరాలు కేంద్ర ప్రభుత్వ అవార్డులను ఇటీవల దక్కించుకున్నాయి. జిల్లాలోని రామతీర్థం, జొన్నవాడ పీహెచ్‌సీలతోపాటు, వింజమూరు మండలంలోని ఊటుకూరు, ముత్తుకూరులోని దొరువులపాళెం, నెల్లూరు రూరల్‌లోని ఆమంచర్ల, పొదలకూరు మండలంలోని ప్రభగిరిపట్నం, మొగళ్లూరు ఆయుష్మాన్‌భవ మందిరాలు అవార్డులను కైవసం చేసుకున్నాయి. గురువారం సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ సుజాత అవార్డులను సంబంధిత ఆరోగ్య కేంద్రాల డాక్టర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక బృందం వచ్చి జిల్లాలోని ఆస్పత్రులను పరిశీలించిందన్నారు. నాణ్యతా ప్రమాణాలున్న కేంద్రాలను అవార్డులకు ఎంపిక చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో అన్ని వైద్యశాలల్లోని డాక్టర్లు పనిచేస్తూ ప్రజలకు మంచి ఆరోగ్య సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.ఉమామహేశ్వరి, డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ రమేష్, డా.బ్రహ్మేశ్వరనాయుడు, డెమో అధికారి కనకరత్నం, క్వాలిటీ మేనేజర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి బైండోవర్

నెల్లూరు(క్రైమ్): రౌడీ, సస్పెక్ట్ షీటర్లు, పాతనేరస్తుల బైండోవర్లు కొనసాగుతున్నాయి. గురువారం నెల్లూరు చిన్నబజారు ఎస్సై ఎ.అయ్యప్ప తన సిబ్బందితో కలిసి పోలీస్‌స్టేషన్ పరిధిలో తనిఖీలు చేపట్టారు. సీఏఎం స్కూల్లో అనుమానాస్పదంగా ఉన్న రౌడీషీటర్ డైకస్‌రోడ్డు చేపల మార్కెట్ ప్రాంతానికి చెందిన పి.తౌసీఫ్‌ఖాన్, పాతనేరస్తుడు పొదలకూరురోడ్డు లక్ష్మీనగర్‌కు చెందిన అబ్బాసుఫియాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని స్థానిక తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు.

అప్పుల బాధ భరించలేక..

• వ్యక్తి బలవన్మరణం



శివకృష్ణ మృతదేహం

ఉలవపాడు: అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రం ఉలవపాడులో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఉలవపాడు పాత రైల్వే రోడ్డుకు చెందిన దొడ్డాక శివకృష్ణ (37)కు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. అతడికి అప్పులున్నాయి. ఆ బాధ భరించలేక ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య లక్ష్మీప్రసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య



సరిత మృతదేహం

తోటపల్లిగూడూరు: మండలంలో పేడూరు పంచాయతీకి చెందిన ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై వీరేంద్రబాబు కథనం మేరకు.. పేడూరు పంచాయతీ దళిత కాలనీకి చెందిన గున్నం సరిత (29)కు కోవూరు మండలానికి చెందిన గున్నం నరేంద్రతో 2017లో వివాహమైంది. భార్యాభర్తల మధ్య విభేదాల నేపథ్యంలో కొన్నేళ్ల క్రితం సరిత భర్త నుంచి విడిపోయి పేడూరులో నివాసముంటోంది. కేటరింగ్ పనులను జీవనంగా చేసుకుంటూ తన ఇద్దరు ఆడబిడ్డలను పోషిస్తోంది. ఏమైందో గానీ బుధవారం అర్ధరాత్రి సరిత ఇంట్లోని బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. గురువారం ఉదయం చూసిన కుటుంబ సభ్యులు సరితను కిందకు దించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లుగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట నమ్మించి..

• నెల్లూరు వాసిని మోసం చేసిన ఇద్దరు వ్యక్తులు
• కేసు నమోదు చేసిన పోలీసులు

నెల్లూరు(క్రైమ్): ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట నమ్మించి మోసగించిన ఇద్దరు వ్యక్తులపై నెల్లూరు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. కోటమిట్ట మెక్లిన్స్‌రోడ్డుకు చెందిన షేక్ సిరాజ్‌బాషా డిగ్రీ పూర్తి చేసి 2011 నుంచి 2024 వరకు కువైట్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేశాడు. ప్రస్తుతం నెల్లూరులోనే ఉంటూ రెండేళ్లుగా షేర్‌మార్కెట్‌కు సంబంధించి ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తున్నాడు. గతేడాది డిసెంబర్‌లో ఆన్‌లైన్‌లో నితిన్ అనే వ్యక్తి ట్రేడింగ్ ఏజెంట్‌గా పరిచయమయ్యాడు. చిట్కాలు ఇస్తానని నమ్మించి గోయల్ అనే మరో వ్యక్తిని సిరాజ్‌కు పరిచయం చేశాడు. ఇద్దరూ కలిసి ట్రేడింగ్‌పై చెబుతూ రమణదీప్ కౌర్ ఖాతాకు నగదు పంపితే లాభం వస్తుందన్నారు. దీంతో సిరాజ్ బాషా సదరు ఖాతాకు పలు దఫాలుగా రూ.1,01,000 నగదును పంపాడు. కొద్దిరోజుల అనంతరం ట్రేడింగ్‌లో రూ.3.50 లక్షలు లాభం వచ్చిందని, తన కమీషన్ రూ.60 వేలు పంపితే కంపెనీ నుంచి డబ్బులు వస్తాయని సిరాజ్‌కు నితిన్ చెప్పాడు. అతడి మాటలు నమ్మశక్యంగా లేకపోవడంతో బాధితుడు గట్టిగా నిలదీయగా నితిన్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన సిరాజ్ సైబర్ పోర్టల్లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గురువారం చిన్నబజారు పోలీసులకు కూడా ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.